



తెలుగు జాతీయ దినపత్రిక

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక






ఆంధ్రప్రదేశ్ | సంపుటి:05 | సంచిక :61 | ఎడిటర్ : బి. అనిల్ కుమార్ | పేజీలు : 10, | వెల. 6రూ/ | 02 మంగళవారం డిసెంబర్2025




## ప్రకృతి ఒడిలో మధురానుభూతి

# అరకు లోయ


అక్షరవిజేత ఎడిటర్ డా,బి.అనిల్ కుమార్/విశాఖపట్నం:


ఒక ప్రయాణం... కేవలం గమ్యాన్ని చేరడం కాదు, మనల్ని మనం కనుగొనడం. మట్టి వాసన, కొండల పలకరింపు, సెలయేటి సంగీతం... ఇవన్నీ ఒక్కచోట చేరి మనసుకు శాంతిని ఇచ్చే ప్రదేశం ఏదైనా ఉందంటే, అది నిస్సందేహంగా అరకు లోయ

**ప్రయాణం - ఒక అద్భుతం**

అరకు అందాలను ఆస్వాదించాలంటే, ముందుగా దాని ప్రయాణాన్నే ప్రేమించాలి. విశాఖపట్నం నుండి రైలు మార్గంలో సాగే ఈ ప్రయాణం కేవలం రైలు ప్రయాణం కాదు, ఒక అద్భుత సినీ దృశ్యం.


2


## కేరళ సీఎం పినరయి విజయన్‌కు ఈడీ షోకాజ్ నోటీసులు

-సీఎం పీఏతో పాటు ఆర్థిక శాఖ మాజీ మంత్రికి కూడా..

-2019లో మసాలా బాండ్ జారీలో ఫెమా రూల్స్ ఉల్లంఘన

-కేఐఐఎఫ్ బీ నిధుల సమీకరణపై సందేహాలు(




2


## కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు

-గుండ్లపాడు జంట హత్యల కేసులో కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి

-సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కీలక పరిణామం

-విచారణకు పూర్తిగా సహకరిస్తానని వెల్లడించిన వెంకట్రామిరెడ్డి

-నిందితుడిని అదుపులోకి తీసుకోవాలని పోలీసులకు కోర్టు ఆదేశం

-ఇంకా లొంగిపోని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి




2


# 2047 నాటికి స్వర్ణాంధ్ర ద్వారా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడతాం

-పవన్ కల్యాణ్ పదేపదే చెబుతున్నట్లు జరగాలి: చంద్రబాబునాయుడు

-రాష్ట్రంలో ఎన్డీయే కూటమి 15-20 ఏళ్లు అధికారంలో ఉండాలన్న ముఖ్యమంత్రి

-నటనతో కష్టపడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పదేపదే చెబుతున్నట్లుగా రాష్ట్రంలో ఎన్డీయే కూటమి 15-20 ఏళ్లు అధికారంలో ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఏలూరు జిల్లాలో 'పేదల సేవలో' ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం బాబాయిని గొడ్డలితో చంపి వేరే వారిపై నెపం నెట్టే నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు.మంచి సంకల్పంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. 2047 స్వర్ణాంధ్ర ద్వారా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. తలసరి ఆదాయం రూ. 3 లక్షల నుంచి రూ. 58 లక్షలకు పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. కొందరు నటనతో కష్టపడుతున్నట్లు కనిపిస్తారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.తెలంగాణలో ప్రభుత్వం 10 ఎకరాల భూమిని వేలం వేస్తే రూ.1,350 కోట్ల రాబడి సమకూరిందని, ఇదంతా గతంలో తెలుగుదేశం హయాంలో జరిగిన అభివృద్ధి వల్లే సాధ్యమైందని వ్యాఖ్యానించారు. విశాఖపట్నంలో గూగుల్ సంస్థ రూ.1.40 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిందని వెల్లడించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ సహా మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు వేసినట్లు చెప్పారు.అమరావతిని కూడా ఉద్యోగాల కల్పనకు కేంద్రంగా మార్చబోతున్నామని అన్నారు. మొదటి దశ పనులు 2028 నాటికి పూర్తవుతాయని తెలిపారు.


2






## జోరుగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

### నెల్లూరులో వర్షంలోనే మంత్రి నారాయణ పర్యటన


2

# ప్రకృతి ఒడిలో మధురానుభూతి అరకు లోయ

రైలు వేగం అందుకుంటున్న కొద్దీ, మనసు ప్రశాంతంగా మారుతుంది. పచ్చని కొండల పక్కగా, చీకటి గుహలను చీల్చుకుంటూ వెళ్తున్నప్పుడు... దాటి రాగానే ఎదురయ్యే సూర్య కిరణం, పచ్చదనం... ఆ అనుభూతిని మాటల్లో వర్ణించలేం. రైలు కిటికీ నుండి చూస్తే, మేఘాలు కొండల అంచులను ముద్దాడుతున్నట్లు అనిపిస్తుంది. ఈ మార్గంలో ఉండే 40కు పైగా సొరంగ మార్గాలు మరియు చిన్నపాటి వంతెనలు ఈ ట్రిప్‌ను ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేస్తాయి.

**అరకు అందాలు - ఆత్మకు చిరునామా**

అరకు అంటే, కేవలం ఒక లోయ కాదుబీ అది వేల ఏళ్ల నాటి కొండల నిశ్శబ్దం, ఆకాశాన్ని తాకే వృక్షాల పచ్చని పందిరి. ఇక్కడికి వచ్చాక, పట్టణపు హడావుడిని మరిచిపోయి, ప్రకృతితో మమేకమవుతాము.

**గాలికొండ - చాపరాయి :**

దేశంలోనే ఎత్తైన ప్రదేశాలలో ఒకటైన గాలికొండ పర్వతం నుండి లోయను చూస్తే, కిందంతా పచ్చని తివాచీ పరిచినట్లు కనిపిస్తుంది. ఇక, ఆ పక్కనే ప్రవహించే చాపరాయి సెలయేరు... నున్నటి రాళ్లపై జాలువారే నీటి గలగల శబ్దం, మనసులోని అలజడులను తొలగించి ప్రశాంతతను అందిస్తుంది.

**బొర్రా గుహలు:**

మిలియన్ల సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ సహజ సున్నపురాయి గుహలు అద్భుత సృష్టికి నిదర్శనం. లోపల సహజంగా ఏర్పడిన శివలింగం, కామధేనువు వంటి ఆకారాలు... ప్రకృతి తనలో దాచుకున్న రహస్యాలను మన కళ్లకు చూపిస్తాయి. వేలాడుతున్న శిలలు, కింద నుండి పైకి పెరుగుతున్న శిలలు ఈ గుహలకు మరింత శోభను ఇస్తాయి.

**ట్రైబల్ మ్యూజియం:**

ఈ ప్రాంతపు ఆదివాసీల సంస్కృతి, వారి జీవన విధానం, కళలు, సంప్రదాయాలను ఈ మ్యూజియం ప్రతిబింబిస్తుంది. వారి నృత్యాలు, దుస్తులు, చేతిపనులు... అరకు ఆత్మ ఎక్కడ ఉందో మనకు తెలియజేస్తాయి.

**కాఫీ తోటల పరిమళం**

అరకు గురించి చెప్పాలంటే, ఇక్కడి కాఫీ గురించి ప్రత్యేకంగా చెప్పాలి. లోయ అంతా విస్తరించి ఉన్న కాఫీ తోటల నుండి వచ్చే సువాసన... మధురమైన అనుభూతిని ఇస్తుంది. ఇక్కడి గిరిజనులు పండించే అరకు కాఫీ అంతర్జాతీయంగా పేరుగాంచింది. ఈ కాఫీ తోటల మధ్య నడుస్తూ, తాజా కాఫీ రుచిని ఆస్వాదించడం ఒక ప్రత్యేకమైన వరం.ఒక ఆహ్వానం

అరకు లోయ కేవలం ఒక పర్యాటక ప్రాంతం కాదుబీ అది జీవితానికి తాత్వికతను నేర్పే ఒక పాఠశాల. మీరు అలసిపోయినప్పుడు, ప్రశాంతత కావాలనుకున్నప్పుడు... మనసును ప్రకృతి ఒడిలో విశ్రాంతి తీసుకోమని ఆహ్వానించే ప్రదేశం అరకు.ఆ కొండల నిశ్శబ్దం, ఆ పచ్చని వాతావరణం... మనసును కడిగి, నూతన ఉత్తేజాన్నిస్తుంది. అందుకే, అరకు ప్రయాణం అంటే, కేవలం దృశ్యాలను చూడడం కాదు... మన ఆత్మను మేల్కొల్పే ఒక పవిత్ర యాత్ర.

**అరకు లోయ చుట్టుపక్కల చూడదగిన ప్రదేశాలు**

అరకు లోయ చుట్టూరా ప్రకృతి సౌందర్యాన్ని, సాహస క్రీడలను మరియు సాంస్కృతిక అనుభూతిని అందించే అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయి.

**కటికి జలపాతాలు**

ఇది అరకుకు దగ్గరలో ఉన్న అత్యంత అందమైన జలపాతాలలో ఒకటి. ఇది గోస్తని నదిపై ఏర్పడింది.



ఈ ప్రదేశానికి చేరుకోవడానికి అరకు నుండి కొంత దూరం జీపులో ప్రయాణించి, ఆ తర్వాత కొంత దూరం ట్రెక్కింగ్ చేయాల్సి ఉంటుంది. పచ్చని అడవుల గుండా సాగే ఈ నడక సాహసప్రియులకు మంచి అనుభూతిని ఇస్తుంది. ఇక్కడ స్నానం చేయడానికి మరియు ప్రకృతిని ఆస్వాదించడానికి అవకాశం ఉంటుంది.ఇక్కడికి ప్రయాణించేటప్పుడు పానీయాలు, స్నాక్స్ తీసుకెళ్లడం మంచిది.

**అనంతగిరి జలపాతాలు**

విశాఖపట్నం నుండి అరకు వెళ్లే మార్గంలో అనంతగిరి వద్ద ఈ జలపాతాలు ఉంటాయి. ఇవి కాఫీ తోటలకు మరియు దట్టమైన అడవులకు సమీపంలో ఉంటాయి. చుట్టూ ఉన్న కాఫీ తోటల సువాసన మధ్య జాలువారే నీటి దృశ్యం కనువిందు చేస్తుంది. ఇక్కడి వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది.

**పద్మాపురం గార్డెన్స్**

ఈ తోటలకు చారిత్రక ప్రాధాన్యత ఉంది. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో కూరగాయలు మరియు పండ్ల సాగు కోసం దీనిని అభివృద్ధి చేశారు.ఇక్కడ రకరకాల అరుదైన మొక్కలు, పూల మొక్కలు, చెట్లు చూడవచ్చు. ముఖ్యంగా, ఇక్కడ హాంగింగ్ కాటేజెస్ అని పిలువబడే చెట్టు ఇళ్లలో బస చేసే అవకాశం కూడా ఉంటుంది. అలాగే, తోట చుట్టూ తిరగడానికి టాయ్ ట్రైన్ సదుపాయం కూడా అందుబాటులో ఉంది.

**మత్స్యగుండం**

ప్రత్యేకత: ఇది అరకు నుండి కొంచెం దూరంలో ఉన్న మరొక ఆకర్షణ. ఇది ఒక చిన్న సరస్సు, ఇక్కడ చేపలు గుంపులు గుంపులుగా జీవిస్తాయి.ఈ చేపలను స్థానిక గిరిజనులు పవిత్రంగా భావిస్తారు. ఇక్కడి చేపలను ఎవరూ పట్టుకోరు లేదా తినరు. వాటి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది, అందుకే ఈ ప్రాంతానికి 'మత్స్యగుండం' (చేపల సరస్సు) అనే పేరు వచ్చింది.

**టైడా ప్రత్యేకత:**

విశాఖపట్నం నుండి అరకు వెళ్లే మార్గంలో ఉండే ఒక అడవి ప్రాంతం. ఇది ఎకో–టూరిజం కేంద్రంగా ప్రసిద్ధి చెందింది.ఇక్కడ రకరకాల పక్షులు, వన్యప్రాణులను చూసే అవకాశం ఉంది. అడవిలో బస చేయడానికి గిరిజన పద్ధతిలో నిర్మించిన గుడిసెలు లేదా పర్యావరణ అనుకూల రిసార్ట్‌లు ఉంటాయి. ప్రకృతిలో ప్రశాంతంగా గడపడానికి ఇది అనువైన ప్రదేశం.

# 2047 నాటికి స్వర్ణాంధ్ర ద్వారా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడతాం

అమరావతిని కూడా ఉద్యోగాల కల్పనకు కేంద్రంగా మార్చబోతున్నామని అన్నారు. మొదటి దశ పనులు 2028 నాటికి పూర్తవుతాయని తెలిపారు. గత పాలకుల ఐదేళ్ల హయాంలో అభివృద్ధి ఊసే లేదని విమర్శించారు. గత ఐదేళ్ల పాలనకు, కూటమి 18 నెలల పాలనకు వ్యత్యాసం ఉందని అన్నారు. జనవరిలోగా రాష్ట్రంలో గుంతల రోడ్లన్నీ పూడ్చి బాగు చేస్తామని, అవసరమైతే కొత్త రహదారులు నిర్మిస్తామని అన్నారు.రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడేందుకు సంజీవిని ప్రాజెక్టును తీసుకు వస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. జీవన ప్రమాణాలు పెరగాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు. గంజాయిపై గత పాలకులు కఠినంగా వ్యవహరించలేదని ఆరోపించారు. గంజాయి డాన్‌గా మారిన ఒక మహిళ కూడా ఇప్పుడు బయటకు వచ్చారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంత ప్రమాదకరమో ఈ ఒక్క ఘటన చూస్తే అర్థమవుతుందని అన్నారు.

రైతులు డిమాండ్ ఆధారిత పంటలు వేసి ఎక్కువ ప్రయోజనం పొందాలని సూచించారు. సమీకృత వ్యవసాయ విధానాలను అవలంభించాలని అన్నారు. డ్రోన్ సాంకేతికతను వినియోగించి వ్యవసాయ వ్యయాన్ని తగ్గించుకుని, దిగుబడి పెంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఆక్వా కల్చర్ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.850 కోట్లను భరిస్తోందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని రైతులకు సూచించారు.

కొబ్బరి, కోకో, కాఫీ వంటి పంటలు ఉన్నాయని, కాబట్టి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. సంక్షేమం, సుపరిపాలన, అభివృద్ధి ఇస్తామని మాట ఇచ్చి దానిని అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చామని వెల్లడించారు. ఇటీవల విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సు ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

ఇప్పటికే రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని, వీటి ద్వారా వేలాది ఉద్యోగాలు వస్తాయని అన్నారు. ఏలూరు వంటి జిల్లాలకు పెద్ద ఎత్తున పరిశ్రమలు రావాలని అన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూయర్ కింద చేయూత అందిస్తామని హామీ ఇచ్చారు. కొల్లేరులో ఉన్న సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని చంద్రబాబునాయుడు అన్నారు.

2027 గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రానికి ఓ గేమ్ ఛేంజర్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గోదావరి, కృష్ణా డెల్టాల్లో నీటి ఎద్దడి సమస్య ఉండదని ఆయన అన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు చూడాలని అన్నారు. అనంతపురం జిల్లాకు నీళ్లు ఇవ్వడం వల్ల ఆ ప్రాంత ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని చంద్రబాబునాయుడు అన్నారు.

# కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు

పల్నాడు జిల్లా గుండ్లపాడు జంట హత్యల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ8 నిందితుడిగా ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి సోమవారం పల్నాడులోని స్థానిక కోర్టులో లొంగిపోయారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.సోమవారం మధ్యాహ్నం ఒంటరిగా కోర్టుకు వచ్చిన వెంకట్రామిరెడ్డి, న్యాయమూర్తి ఎదుట లొంగిపోతున్నట్లు తెలిపారు. ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెబుతూనే, దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తానని స్పష్టం చేశారు. దీంతో, ఆయన్ను అదుపులోకి తీసుకోవాలని పోలీసులను కోర్టు ఆదేశించింది.ఈ జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులు ఏ8, ఏ9 నిందితులుగా ఉన్నారు. గతంలో హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందగా, దానిని పోలీసులు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం రెండు రోజుల క్రితం వారి బెయిల్‌ను రద్దు చేసింది. రెండు వారాల్లోగా పోలీసుల ఎదుట లొంగిపోయి, విచారణకు సహకరించాలని ఆదేశించింది.వెంకట్రామిరెడ్డి లొంగిపోయినప్పటికీ, ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంకా లొంగిపోలేదు. సుప్రీంకోర్టు విధించిన గడువు ఇంకా ఉండటంతో ఆయన హైదరాబాద్ లేదా బెంగళూరులో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ ఏడాది మే నెలలో వెల్దుర్తి మండలం గుండ్లపాడులో టీడీపీకి చెందిన ఇద్దరు సోదరులు హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మొత్తం 10 మందిపై కేసు నమోదు కాగా, పిన్నెల్లి సోదరులు కూడా నిందితులుగా ఉన్నారు. వెంకట్రామిరెడ్డి లొంగుబాటుతో కేసు దర్యాప్తు వేగవంతం కానుంది.

# కేరళ సీఎం పినరయి విజయన్‌కు ఈడీ షోకాజ్ నోటీసులు

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాకిచ్చింది. విజయన్ తో పాటు ఆయన వ్యక్తిగత కార్యదర్శి అబ్రహం, ఆర్థిక శాఖ మాజీ మంత్రి థామస్ ఐజాక్ కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విదేశీ మారకపు నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం నిధులు సమీకరించే ప్రభుత్వ సంస్థ కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ బోర్డ్ (కేఐఐఎఫ్ బీ) 2019లో జారీ చేసిన మసాలా బాండ్‌ల వ్యవహారంలో ఈ నోటీసులు జారీ చేసింది. నిధుల సేకరణలో ఫెమా మార్గదర్శకాలను పాటించలేదన్న ఈడీ ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యవహారంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అసలు ఏంటీ వివాదం..**

కేరళలోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడానికి కేఐఐఎఫ్ బీ 2019 లో లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో సుమారు రూ.2,150 కోట్ల విలువైన మసాలా బాండ్ లను జారీ చేసింది. ఈ నిధుల సమీకరణ మరియు వాటి వినియోగంలో ఫెమా నిబంధనలను పాటించలేదని, ఆర్బీఐ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరించిందనేది ప్రధాన ఆరోపణ. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన కేఐఐఎఫ్ బీ.. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ మార్కెట్ల నుండి నేరుగా రుణాలు తీసుకోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 293(1)కి విరుద్ధమని కాగ్ తన నివేదికలో పేర్కొంది. అయితే, కేఐఐఎఫ్ బీ తన కార్యకలాపాలు చట్టబద్ధంగా, ఆర్బీఐ మార్గదర్శకాలకు లోబడి ఉన్నాయని, ఈ అప్పులు రాష్ట్ర బడ్జెట్ పరిధిలోకి రావని వాదించింది

# జోరుగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

అమరావతి,డిసెంబర్1(

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పక్రియ శరవేగంగా సాగుతోంది. సోమవారం ఉదయం నుంచే గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేపట్టారు. ఈ క్రమంలో ఉదయం 9:00 గంటలకే 62.40 శాతం మంది లబ్దిదారులకు పింఛన్ల సొమ్ము అందజేశారు.డిసెంబర్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు రూ.2,738 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈనెల ఇచ్చే పింఛన్లతో కలిపి రూ.50,763 కోట్లు పేదల కోసం కూటమి సర్కార్ ఖర్చు చేసింది.

నెల్లూరు జిల్లా 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి పర్యటించారు. జోరు వానలో ఇంటింటిటికీ వెళ్లి పెన్షన్లను అందజేశారు. వర్షంలో కూడా తమ ఇంటికి వచ్చి పెన్షన్ అందచేసిన నేతలకు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెల్లారి ఆరు గంటల నుంచే 68 లక్షల మందికి పెన్షన్ల పంపిణీ జరుగుతోందన్నారు. వర్షంలో కూడా పెన్షన్ పంపిణీకి వచ్చిన మీకే మా ఓటని సంతోషంగా చెప్పారని అన్నారు. తాము ఓటు కోసం రాలేదు ఇచ్చిన మాట కోసం వచ్చామని లబ్దిదారులకు చెప్పినట్లు మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఏలూరులో ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ పాల్గొన్నారు. ఏలూరులో 2వ డివిజన్ పరిధిల రామానగర్‌లో వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఎమ్మెల్యే పింఛన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి.. లబ్దిదారులకు స్వయంగా పింఛన్ల డబ్బులు అందజేశారు. ఏలూరు నియోజకవర్గంలో కొత్తగా 32 మందికి నూతన పింఛన్లు మంజూరు చేశారు. 27 మంది వితంతువులకు, ఐదుగురు డయాలసిస్‌తో బాధపడుతున్న పేషెంట్లకు 10 వేల రూపాయలను అధికారులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు ప్రజల కోసమే కష్టపడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు కోసమే పాటు పడుతుందని ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడించారు.

# కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయి...-ఎమ్మెల్యే మల్ రెడ్డి.

**పోల్కంపల్లి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా బీసీ నేత కొండల్ గౌడ్.-ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసిన కాంగ్రెస్ అభ్యర్థి కొండల్ గౌడ్.**

అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :–

పోల్కంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బిసి నేత గుండ్ల కొండల్ గౌడ్ ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నేతలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని ఇబ్రహీంపట్నం క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొండల్ గౌడ్ కలిశారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డి కొండల్ కి శుభాకాంక్షలు తెలుపుతూ గెలుపు కోసం కృషి చేయాలని తెలిపారు. సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని, గ్రామీణ ప్రాంతంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించామని తెలిపారు. పది ఏండ్ల టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ప్రస్తుతం అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు తెలిపారు. ఆడపడుచులకు బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ప్రలోభాలకులోను కాకుండా గ్రామం అభివృద్ధి కోసం



కృషి చేసే పార్టీకి పట్టం కట్టాలని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పోల్కంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

# చిలకలూరిపేటలో విషాదం

## కన్నంనాయుడు మృతి- కుటుంబాన్ని పరామర్శించిన జనసేన యువ నాయకులు మండలనేని చరణ్ తేజ

పల్నాడు జిల్లా చిలకలూరిపేట అక్షర విజేత

చిలకలూరిపేట నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఒక దారుణ ప్రమాదం26వ వార్డు ప్రజలను విషాదంలో ముంచెసింది. కూలి పనుల నిమిత్తం చిలకలూరిపేటకు వలస వచ్చిన కన్నంనాయుడు (38) మంగళవారం రాత్రి ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు.

వివరాల్లోకి వెళ్తే కన్నంనాయుడు ఊక లోడుతో వెళు_న్న ఒక లారీపై ఉన్నారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తాకడంతో, ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. కన్నంనాయుడు మృతితో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో కూరుకుపోయింది. ఆయనకు భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోయి ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది.

**జనసేన యువ నాయకుల అండ**

ఈ విషాద వార్త తెలుసుకున్న నియోజకవర్గ జనసేన యువ నాయకులు మండలనేని చరణ్ తేజ చిలకలూరిపేట జనసేన పార్టీ సమన్వయకర్త తోట రాజా రమేష్ ఇరువురు తక్షణమే కన్నంనాయుడు కుటుంబ సభ్యుల వద్దకు చేరుకున్నారు. ఆయన వారిని ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో వారికి అండగా ఉంటామని, అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు."ఏ విషయమైనా, ఎటువంటి సహాయం కావాలన్నా తనను సంప్రదించవచ్చని," మండలనేని చరణ్ తేజ ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు.





# కంటి చూపు లేకుంటే అన్నీ సమస్యలే : ప్రత్తిపాటి

### - ప్రత్తిపాటి ఫౌండేషన్ ప్రజల ఆరోగ్య రక్షణలో ఎల్లప్పుడూ ముందే ఉంటుంది.
### - 38 వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మాజీమంత్రి ప్రత్తిపాటి.







చిలకలూరిపేట అక్షర విజేత

వృద్ధుల్ని తమ బిడ్డలు, కుటుంబసభ్యులు ప్రేమ, గౌరవంతో చూస్తారనే ప్రభుత్వం వారికి ఠంఛన్ గా ఒకటో తేదీన పింఛన్లు అందిస్తోందని, వయసు పైబడినవారు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, దూరం వెళ్లి వైద్యసేవలు పొందలేరనే ప్రత్తిపాటి ఫౌండేషన్ పలు రకాల వైద్య శిబిరాలు ఉచితంగా నిర్వహిస్తోందని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని 28వ వార్డులో ప్రత్తిపాటి ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రత్తిపాటి సోమవారం ప్రారంభించి మాట్లాడారు.వినికిడి సంబంధిత సమస్యలున్నవారికి 7న ఉచిత వైద్య శిబిరం కంటి చూపు సరిగా లేకుంటే ఎన్నో అవస్థలు పడాలని, ఒకరిపై ఆధారపడే వయసులో ఉన్న వృద్ధులు మరిన్ని సమస్యలు ఎదుర్కొంటారని ప్రత్తిపాటి చెప్పారు. పేదలకు ఉచిత వైద్యసేవలు అందించే సంస్థలకు ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయన్న ప్రత్తిపాటి.. శంకర కంటి ఆసుపత్రి వారు పేదలకు అందించే వైద్యసేవల్లో కూటమిప్రభుత్వ సహకారం కూడా ఉందన్నారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన 38వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కంటిసంబంధిత సమస్యలతో బాధపడేవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రత్తిపాటి ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుం దన్నారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలపై టీడీపీ శ్రేణులు ప్రజలక విస్తృత అవగాహన కల్పించా లని, వార్డు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జ్ లు ప్రజల అనారోగ్య సమస్యల్ని గుర్తించి, ఫౌండేషన్ వైద్య శిబిరాలకు వారిని చేర్చాలన్నారు. 7వ తేదీన వినికిడి (చెవిటి, మూగ) సంబంధిత సమస్యలున్న వారికి ప్రత్తిపాటి గార్డెన్స్ లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. వైద్య పరీక్షలు చేసిన తర్వాత సమస్య ఉన్నవారికి ఉచితంగా వినికిడి మిషన్లు కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, షేక్ మస్తాన్ వలి, శంకర్ కంటి ఆసుపత్రి డాక్టర్ శ్రీనివాసరావు, ఫౌండేషన్ నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పేట లీలావతి హాస్పిటల్స్‌లో అద్భుతం

### -: 'హై-రిస్క్' గర్భంతో మగబిడ్డకు జన్మ

పల్నాడు జిల్లా చిలకలూరిపేట అక్షర విజేత

చిలకలూరిపేట పట్టణంలోని లీలావతి హాస్పటల్ వైద్య సేవలకు మరో మణిహారం లభించింది. హై-రిస్క్ గర్భంతో బాధపడుతున్న ఒక మహిళ, వైద్య నిపుణురాలు డా. లావు సుష్మ పర్యవేక్షణలో సురక్షితంగా మగబిడ్డకు జన్మనిచ్చింది.కుటుంబంలా మారిన రోగులు, డాక్టర్లు:ఆనందకరమైన అనుభూతిఈ సందర్భంగా డాక్టర్ సుష్మ మాట్లాడుతూ, "రోగులు కేవలం రోగులు కాదు, మా కుటుంబ సభ్యులుగా మారినప్పుడు కలిగే సంతోషకరమైన అనుభూతి మాటల్లో చెప్పలేం. మాతాశిశువు క్షేమంగా ఉన్నారని తెలిసిన ఆ క్షణం, వైద్యులకు అత్యంత సంతృప్తినిస్తుంది" అని తెలిపారు.హై-రిస్క్ గర్భం కారణంగా తల్లి ఆరోగ్యంపై ఆందోళన నెలకొన్నప్పటికీ, లీలావతి హాస్పిటల్స్ బృందం తీసుకున్న ప్రత్యేక జాగ్రత్తలు, అధునాతన వైద్య సేవలతో చివరకు మగబిడ్డ పుట్టాడు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండడంతో కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. డా. లావు సుష్మ ఆధ్వర్యంలో ఈ విజయం సాధించినందుకు ప్రజలు హాస్పిటల్ సేవలను అభినందిస్తున్నారు.



# నలుగురు పేకాట రాయుళ్ల అరెస్టు: రూ.4500 స్వాధీనం

### -కావూరి, బొప్పుడి గ్రామాల్లో దాడులు - మొత్తం తొమ్మిది మందిపై కేసు నమోదు

కావూరి, బొప్పుడి అక్షర విజేత

చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కావూరి, బొప్పుడి గ్రామాలలో చట్టవిరుద్ధంగా పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి మొత్తం ?7,300 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

కావూరిలో నలుగురి అరెస్టు చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ శ్రీ జి. అనిల్ కుమార్ గారు తన సిబ్బందితో కలిసి కావూరి గ్రామ పరిధిలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కోత మొక్క పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుండి ?4,500/- నగదును స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేయడం జరిగింది.

బొప్పుడిలో ఐదుగురు అదుపు

అదేవిధంగా, బొప్పుడి గ్రామ పరిధిలో కూడా పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ కొత్త మొక్క పేకాట ఆడుతున్న మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి ?2,800/- రూపాయలను స్వాధీనపరచుకొని, వారిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేశారు.

ఎస్ఐ శ్రీ జి. అనిల్ కుమార్ మాట్లాడుతూ, గ్రామాల్లో ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.






# ఏలేశ్వరం పట్టణంలో ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న....ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు ప్రతినిధి, అక్షర విజేత : నగర పంచాయతీ అయిదో వార్డులో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సోమవారం నేర్చుకోవాలని పాల్గొన్నారు.కూటమి పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే సత్యప్రభ లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేపట్టారు.నూతనంగా మంజూరైన పెన్షన్లను ఆయా లబ్ధిదారులకు ఎమ్మెల్యే సత్యప్రభ చేతుల మీదుగా అందించారు.ఇటీవల మృతి చెందిన పసుపులేటి బాబ్జి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి,ధీన స్థితిలో ఉన్న ఆమెకు 50 కేజీలు బియ్యం అందించి ఆమెకు అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు.ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి పని చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబీ,కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి,మూది నారాయణస్వామి,మసిరపు బుజ్జి,పెంద్ర శ్రీను,ఎండగుండి నాగబాబు,కోనాల వెంకట రమణ, కూటమి నాయకులు వాగు రాజేష్,జొన్నాడ వీరబాబు,జ్యోతుల పెదబాబు,గట్టెం వెంకట రమణ,రెడ్డి రాజు,రుచి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీమంత్రి స్థానిక శాసన సభ్యులు పత్తిపాటి పుల్లారావు ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా జాయింట్ సెక్రెటరీ మస్తాన్ వలి, పట్టణానికి చెందిన జర్నలిస్టులు

చిలకలూరిపేట అక్షర విజేత

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో జాయింట్ సెక్రటరీ గా ఎన్నికైన సీనియర్ జర్నలిస్ట్ షేక్ మస్తాన్ వలి, పట్టణంలోని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో కలసి సోమవారం నాడు మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ సందర్భంగా మస్తాన్ వలి నీ ప్రత్తిపాటి పుల్లారావు శాలవతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, వైస్ చైర్మన్ పిల్లి కోటి, టిడిపి సీనియర్ నాయకులు తేళ్ల సుబ్బారావు ల తో పాటు ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా ప్రతినిధులు ఏపీయూడబ్ల్యూజే పల్నాడు జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు అడపా అశోక్ కుమార్,ఎన్.వి.ఎస్.ప్రసాద్.అలపాటి ఆంజనేయులు, శ్రీకాంత్, కుప్పం కళ్యాణ్ చక్రవర్తి, సుభాని, కోటేశ్వరావు, శివ, రవి మరియు చిలకలూరిపేట కార్యదర్శి దరియా వలి, జర్నలిస్టులు దాసు, నాగరాజు కొచ్చర్ల చందు, ఎన్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొన్న: శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు..





పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం అక్షర విజేత

చిలకలూరిపేట పట్టణంలోని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మాజీమంత్రి, ప్రస్తుత శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు లబ్ధిదారులకు పెన్షన్ అమౌంట్ ను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, విధవలు వంటి సామాజికంగా బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ధ్యేయంతో ఎన్టీఆర్ భరోసా పథకం అమలవుతోందని తెలిపారు.కూటమి ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ పథకాలనే ఇప్పుడు మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.పట్టణంలోని 30,31 వార్డులకు చెందిన లబ్ధిదారులు పెన్షన్ సొమ్ము అందుకున్నారు.ఈ పథకం వల్ల రోజువారి జీవనంలో కొంత ఆర్థిక నెమ్మది కలుగుతోందని పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి స్థానిక నాయకులు, కార్యకర్తలు, మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.



ఏలేశ్వరం పట్టణంలో ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న....ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు ప్రతినిధి, అక్షర విజేత : నగర పంచాయతీ అయిదో వార్డులో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సోమవారం నేర్చుకోవాలని పాల్గొన్నారు.కూటమి పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే సత్యప్రభ లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేపట్టారు.నూతనంగా మంజూరైన పెన్షన్లను ఆయా లబ్ధిదారులకు ఎమ్మెల్యే సత్యప్రభ చేతుల మీదుగా అందించారు.ఇటీవల మృతి చెందిన పసుపులేటి బాబ్జి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి,ధీన స్థితిలో ఉన్న ఆమెకు 50 కేజీలు బియ్యం అందించి ఆమెకు అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు.ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి పని చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబీ,కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి,మూది నారాయణస్వామి,మసిరపు బుజ్జి,పెంద్ర శ్రీను,ఎండగుండి నాగబాబు,కోనాల వెంకట రమణ, కూటమి నాయకులు వాగు రాజేష్,జొన్నాడ వీరబాబు,జ్యోతుల పెదబాబు,గట్టెం వెంకట రమణ,రెడ్డి రాజు,రుచి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆటో డ్రైవర్లు పాఠశాలల పిల్లల పట్ల మర్యాదగా వివరించాలి

## -పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అప్పన్న-ట్రాఫిక్ నియమ నిబంధనలపై ఆటో -డ్రైవర్లకు సూచనలు సలహాలు అందజేసిన సీఐ

పాయకరావుపేట,అక్షర విజేత) :
పాఠశాల పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్ళేప్పుడు ఆటో డ్రైవర్లు పాఠశాలల పిల్లల పట్ల మర్యాదగా వివరించాలని స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.అప్పన్న విజ్ఞప్తి చేశారు..
పట్టణంలో విపరీతంగా పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీ నివారణ చర్యల్లో భాగంగా ట్రాఫిక్ నియమ నిబంధనలపై సోమవారం ఆయన పట్టణంలో గల ఆటో స్టాండ్ వద్ద డ్రైవర్లకు డ్రైవింగ్ కు సంబంధించి విధి విధానాలు, సూచనలు సలహాలను అందజేశారు.ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ హౌస్ అధికారి అప్పన్న మాట్లాడుతూ
ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరూ విధి నిర్వహణ (డ్రైవింగ్) సమయంలో విధిగా యూనిఫాం షర్ట్ వేసుకోవాలని సూచించారు. ఆఫ్ నిక్కర్లు,షాట్లుతో ఎట్టి పరిస్థితులలోనూ ఆటో డ్రైవ్ చేయరాదన్నారు. మైనర్లకు ఆటో ఇవ్వవద్దని,ఫ్రంట్ సీటుపై రెండు వైపులా ప్రయాణికులను ఎక్కించురాదని ఆదేశించారు.ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సులకు అడ్డంగా ఆటోలు నిలిపినట్లైతే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వై జంక్షన్ వద్దు గల హైవే సిగ్నల్ పాయింట్ వద్ద ఎట్టి పరిస్థితులలోనూ నిబంధనలకు విరుద్ధంగా ఆటోను తప్పించరాదని, పాఠశాల పిల్లలను తీసుకొచ్చేప్పుడు వారి పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు.పాసింజర్ల కోసం రోడ్డుపై అడ్డంగా ఆటోలను నిలిపుతూ ట్రాఫిక్ కు అంతరాయం కలిగించరాదని విజ్ఞప్తి చేశారు.మెయిన్ రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకూడదని,నిబంధనలకు విరుద్ధంగా ఆటోలో నడిపితే అటువంటి వారిపై చర్యలు తప్పవని పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అప్పన్న హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.





# చట్టప్రకారం ఫిర్యాదులను పరిష్కరించాలి

అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :
పోలీస్ ప్రజావాణి ఫిర్యాదులను చట్టప్రకారం పరిష్కరించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అధికారులకు సూచించారు. నిజామాబాదు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ ప్రజావాణి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి 11 అర్జీలను స్వీకరించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని సూచించారు. వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు.

# ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి

## .-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ

అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి : ఎయిడ్స్ వ్యాధి నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి లోని ఏడవ అంతస్తులో గల సెమినార్ హాల్లో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యూనిట్, స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్నేహ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ హాజరై ప్రసంగించారు. తప్పని పరిస్థితుల్లో వృత్తిని ఎంచుకోని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. మీ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ తో పాటు సరైన పోషకాహారాన్ని తీసుకోవాలని సమయానుకూలంగా మందులు వాడలని సూచించారు. ప్రతి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సెక్స్ వర్కర్ల సంక్షేమం వారి మంచి కోసం కృషి చేస్తున్న స్నేహ సొసైటీ నిర్వహిస్తున్న స్నేహ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్ట్ నిర్వాహకులు ఎస్.సిద్దయ్య అందించిన పౌష్టికాహార కిట్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల వైద్య అధికారులు, ఆస్పత్రి అధికారులు, వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగాలంటే,సంక్షేమ ఫలాలు, పథకాలు అందరికీ అందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యం...శ్రీహరిరావు!

అక్షరవిజేత మామడ: బూరుగుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి నాగుల భూమన్న, ఉపసర్పంచ్ అభ్యర్థి ఆత్రం భారతి మారుతీ సోమవారం రోజు మండల కేంద్రం లో నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి మాజీ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రత్యర్థి ఎవరు కూడా నామినేషన్ వేయకపోవడం తో ఒక్కరే వేశారు కాబట్టి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది.ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి పూర్తి స్థాయిలో తీసుకెళ్లడం కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తల తోనే సాధ్యం అయ్యిందని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని,గ్రామపంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఏఎంసీ చైర్మన్ లింగారెడ్డి,మాజీ జడ్పీటీసీ లు రఫీ, సంతోష్,రామారావు,బింరావ్ పటేల్ పులిమడుగు, మొర్రిగూడం పటేల్ పర్సురామ్ నాయకులు గంగారెడ్డి, లింగారెడ్డి, బాపయ్య, శ్రీనివాస్, సల్కాం శేఖర్, లింగన్న ,నర్సారెడ్డి,నాగుల చిన్నయ్య, రాజు, రమేష్, శ్రీకాంత్,చిత్రు, మాదస్తూ రాజు తదితరులు పాల్గొన్నారు.



# హిందువులంతా సంఘటితంకావాలి

# హైందవ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

## భారత్ ను ప్రపంచంలో అగ్రగామిగా నిలపాలి -కులమతాలకు అతీతంగా సమాజ నిర్మాణం వ్యవసాయాన్ని, గ్రామీణ కుటీర పరిశ్రమలను పరిరక్షించాలి తాడేపల్లిగూడెం హైందవ సమ్మేళనంలో ఆర్ ఎస్ ఎస్ జాతీయ నాయకులు భాగయ్య

తాడేపల్లిగూడెం, (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: భారత దేశంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న హిందూ బంధువులు అంతా సంఘటితమై హైందవ ధర్మాన్ని పరిరక్షించుకుని భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలపాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అఖిలభారత కార్యకారిణి సభ్యులు మాననీయ భాగయ్య పిలుపునిచ్చారు. ప్రపంచంలో శాంతి నెలకొనాలంటే హిందూ సమాజం సంఘటితం కావాలని వ్యాఖ్యానించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఎన్ కె గ్రౌండ్స్ లో సోమవారం సాయంత్రం జరిగిన హిందూ సమ్మేళనం లో ఆయన ప్రధానోపన్యాసం చేశారు. హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి అధ్యక్షులు బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. భాగయ్య మాట్లాడుతూ ప్రపంచానికి నాగరికతను సంస్కృతిని విజ్ఞానాన్ని పంచిన భారతీయ హైందవ ధర్మం విదేశీ సాంగత్యంతో కనుమరుగుతోందని నేడు హిందూ పరిరక్షణకు అందరూ పాడు పడాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. పాశ్చాత్య దేశాల సంస్కృతి ప్రభావంతో మనం దిగజారామని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా, రష్యా , కొలంబియా వంటి అనేక దేశాల్లో ప్రజలు హిందూ ధర్మం వైపు మొగ్గు చూపుతున్నార న్నారు. హైందవ ధర్మ పరిరక్షణ కోసం 1925లో నాగపూర్ కేంద్రంగా డాక్టర్ కేశవరావు బలిరామ్ హెడ్గేవార్ ఆర్ఎస్ఎస్ స్థాపించారనీ అన్నారు. హిందువుల పూర్వ చరిత్ర ఏమిటో మనమంతా తెలుసుకొని అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీ భాయ్, రాణా ప్రతాప్ సింగ్, చత్రపతి శివాజీ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని హిందూ సమాజం సంఘటితం అయ్యేందుకు కులాలకతీతంగా అందరూ నడుం కట్టాలని పిలుపునిచ్చారు. హిందువులు పరాక్రమవంతులని, శక్తివంతులని గుర్తు తెచ్చుకోవాలి అన్నారు. పంచ పరివర్తన సూత్రాలను ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. కుటుంబ వ్యవస్థలను కాపాడుకుని, అందరూ మాతృభాషలో మాట్లాడుకోవాలన్నారు. పర్యావరణను పరిరక్షించి, నదులు కాలువలను జలవనరులను




కాపాడుకుని, ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలన్నారు. తల్లిదండ్రులు గురువులతో పాటు సమాజంలో అందరినీ గౌరవించాలని సూచించారు. గోమాతను రక్షించుకొని ప్రకృతి వ్యవసాయం తోపాటు గోవుల నుంచి ఉత్పత్తులను తయారుచేసి విక్రయించడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు అన్నారు. సినిమాలలో హనుమంతుడు, గణపతి, సీతారాములపై వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేస్తున్నారని దీన్ని హిందూ బంధువులు అంతా ఖండించాలన్నారు. యజ్ఞ పురాదీశా శ్రీ వాసవి ప్రపంచ పీఠాధిపతులు శ్రీ శ్రీధర స్వామీజీ అనుగ్రహ భాషణ చేస్తూ ప్రపంచానికి మార్గదర్శనం చేసిన హైందవ ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. హైందవ ధర్మం ఎంతో ఉత్కృష్టమైనదన్నారు. మనం వెళ్లిన వెళ్లకపోయినా అఖండ భారతావనిలో లక్షలాది గా ఉన్న హిందూ దేవాలయాల్లో ప్రతినిత్యం ప్రపంచంలో అందరూ సుఖశాంతులతో ఉండాలని సుభిక్షంగా ఉండాలని అనేక పూజలుయాజ్ఞాలు, యాగాలు, హోమాలు ధార్మిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నార న్నారు. దేవ మానవులే హిందువులని, యజ్ఞయాగ పూజా ఫలాలను విశ్వ మానవాళికి అందించాలని కృషి చేస్తున్నదని అన్నారు. హిందూ ధర్మానికి పూర్వ వైభవం తెచ్చే ఈ బృహత్తర యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. హిందూ సమ్మేళనం నిర్వహణ






సమితి అధ్యక్షులు బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ కుల మతాలుకు అతీతంగా ప్రతి ఒక్కరూ తమ ధర్మాన్ని నిర్వర్తించాలని కోరారు. అందరిని గౌరవించాలాన్నారు. హిందూ ధర్మం లోనే బ్రహ్మ విష్ణు మహేశ్వర తత్వాలు ఉన్నాయని పేర్కొన్నారు. పుట్టుక, పరిపాలన, సేవ, దాన, గుణాలన్నీ దీనిలో భాగమన్నారు. హైందవ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి కార్యదర్శి ముత్తా రామారావు, సహ కార్యదర్శి వేమూరి వెంకటరామం, బిజెపి కిషన్ మోర్చ రాష్ట్ర మాజీ కార్యదర్శి గట్టిం మాణిక్యాలరావు సమ్మేళనం వేదికను పర్యవేక్షించారు.
కార్యక్రమంలో ముందుగా కాకినాడ ఏపీఎస్పీ బెటాలియన్ ఎస్పీ కొండ నరసింహారావు దంపతులు శంఖారావం పూరించి



సమ్మేళనాన్ని ప్రారంభించారు. బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేలాదిగా హాజరైన ఆహుతులను అలరించాయి. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సహసంఘ్ చాలక్ సుంకవల్లి రామకృష్ణ, తాడేపల్లిగూడెం ఖండ సహచాలక్ గ్రంధి సత్యనారాయణ, బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి, నియోజకవర్గ బాధ్యులు ఈతకోట తాతాజీ,బిజెపి ఎక్స్ సర్వీస్ మెన్ సెల్ రాష్ట్ర కన్వీనర్ టి. భోగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికులు, ఇతర కార్మికుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వలవల బాబ్జి, రాష్ట్ర టైలర్స్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, ప్రముఖ పారిశ్రామికవేత్త పసుపులేటి వెంకట రామారావు, బిజెపి గూడెం పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్, జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి,తోపాటు జిల్లా అధినేతలు వ్యాపారవేత్తలు, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.